## కథాకేళి



# ప్రేమించే వయసు

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

స్కూలుకి బయలుదేరిన సుకన్య, దొడ్లోని గులాబీలని కొమ్మతో సహా కోసి ఆ నాలుగింటిని గుత్తిగా కలిపి రబ్బర్ బేండ్ వేసింది. అందంగా వుండడానికి వాటికి అటు, ఇటు ఫెరన్ ఆకులని వుంచింది.

"ఇవెక్కడికమ్మా?" అడిగాడు సుకన్య తండ్రి స్కూటర్ స్టాండ్ తీస్తూ, కూతురు చేతిలోని ఆ చిన్ని బొకేని చూసి.

"మా మేథ్స్ టీచర్‌కి డేడీ."

"ఇవాళ్ళ ఆయన పుట్టిన రోజా?" అడిగాడాయన.

"కాదు. బాగా చెప్తారు లెక్కలు."

తండ్రి స్టార్ట్ చేయగానే స్కూటర్ ఎక్కి కూర్చుంది సుకన్య. అయిదు నిముషాల్లో ఆమెని స్కూల్ దగ్గర దింపి తన ఆఫీస్‌కి వెళ్ళిపోయాడాయన. సుకన్య సరాసరి స్టాఫ్ రూంలోకి వెళ్ళింది. మేథ్స్ టీచర్ ఇంకా రాలేదు. గుమ్మం దగ్గరే ఓపికగా ఆయన కోసం ఎదురుచూడసాగింది.

సుకన్య వయసు పదహారు. బాబ్డ్ హెయిర్. గుండ్రటి మొహం. తెల్లటి పళ్ళు. చూడడానికి పదిహేడేళ్ళ అమ్మాయిలా వుంటుంది. స్కూల్ యూనిఫాంలో ఎంతో అందంగా వుంది సుకన్య.

దూరం నించే మేథ్స్ టీచర్‌ని చూసిన సుకన్యలో కొద్దిగా భయం, కొద్దిగా ఎక్సయిట్‌మెంట్. ఆయన దూరం నించే సుకన్యని చూసి చిన్నగా నవ్వాడు. దగ్గరకి వచ్చాక అడిగాడు-

"థర్డ్ బెల్ కొట్టారు. ఇంకా క్లాసుకి వెళ్ళలేదా?" అని.

"లేదండీ. మీకీ బొకే ఇద్దామని ఆగాను."

"థాంక్స్" చెప్పాడాయన దాన్నందుకుని.

"మీ కోసం స్వయంగా చేసానండీ" వుత్సాహంగా చూస్తూ చెప్పింది సుకన్య.

"అయితే డబుల్ థాంక్స్. ఎల్లో రోజ్ ఎంతో బావుంది" చెప్పాడాయన.

సుకన్య తన క్లాస్‌కి వెళ్ళిపోయింది.

టీచర్‌తో చెప్పి తన పేరు ఎదుట ప్రజెంట్ వేయించుకుంది. తర్వాతి పీరియడ్ మేథ్స్.

ఆయన రాబోయే ముందు అంతా కొత్త టీచర్ గురించి మాట్లాడుకున్నారు.

"లెక్కలు భలే బాగా చెప్తారు ఈ సర్."

"ఎంత బావుంటాడో."

"ఎప్పుడూ నవ్వుతూంటాడు.'

"నాటిల్లో బావుంటాడని తెలుసేమో, ఎప్పుడూ టక్ చేసుకుంటాడు."

"ఆయనకి పెళ్ళి అయిందా?" అడిగింది సుకన్య.

"లేదు. బ్రహ్మచారి. అందుకే అంత ఖరీదైన షూస్, వాచ్, బట్టలు కొన గలిగాడు" నవ్వింది సుకన్య పక్కన కూర్చున్న అమ్మాయి.

'అతనికి పెళ్ళయిందా?' అని సుకన్య ఆ వారంలో అడగడం అది నాలుగవసారి. ముగ్గురమ్మాయిల్ని అడి గింది. అంతా కాలేదని సమాధానం చెప్పారు.

మేథ్స్ టీచర్ టెక్స్ట్‌బుక్ తెరిచి పాఠం చెప్పసాగాడు. ఎంతో శ్రావ్యంగా చెప్తున్న ఆ పాఠాన్ని మైమరిచి విన్నది సుకన్య.

మర్నాడు వుదయం సుకన్య గిఫ్ట్ రేపర్ చుట్టిన ఓ సీసాని స్టాఫ్ రూం లోని మేథ్స్ టీచర్‌కి ఇచ్చింది.

"ఏమిటిది?" అడిగాడు అతను.

"వేరుశెనగ పప్పు పాకం పట్టాను సార్. మీ కోసం నేనే స్వయంగా చేయించాను మా నానమ్మచేత. ఆవిడ బాగా చేస్తుంది."

"దేనికి ఆవిణ్ణి శ్రమ పెట్టావ్ పాపం?"

"శ్రమేం లేదు సార్. నిజానికది ప్లెషర్."

మేథ్స్ టీచర్ చిన్నగా నవ్వి చెప్పాడు-

"థాంక్ యూ సోమచ్."

కొద్ది క్షణాలు ఏదో ఆలోచించాడతను. వెళ్తున్న సుకన్యని పిలిచి అడిగాడు-

"నీ పేరు?"

"సుకన్య సర్."

"గుడ్. రేపు ఆదివారంగా. ఇద్దరం కలిసి లంచ్ తీసుకుందామా? స్కూల్ యూనిఫాంలో కాక మామూలు బట్టల్లో నువ్వు బావుంటావని పందెం?"

"అలాగే సర్" చెప్పింది ఆనందంగా.

"భాస్కర్ పేలెస్‌లో రొటేటింగ్ రెస్టొరెంట్ వుంది. అక్కడ కలుద్దామా? పన్నెండున్నరకి."

"యస్ సర్" చెప్పింది ఎక్సైటింగ్‌గా.

సుకన్య వెళ్ళాక చిన్నగా నవ్వుకున్నాడు. మర్నాడు సుకన్య స్కూల్ యూనిఫాం వేసుకోవాల్సిన అవసరం లేదు. ఎర్ర పట్టు పరికిణీ, పచ్చ ఓణీ వేసుకుని చెవులకి జూకాలు పెట్టుకుంది. శనివారం రాత్రే చేతి వేళ్ళకి గోరింటాకు పెట్టుకుంది.

పన్నెండున్నరకి భాస్కర్ పేలస్ హోటల్‌లోని లిఫ్ట్ దిగి గుండ్రంగా గంటున్నర చుట్టూ తిరిగే ఆ రెస్ట్రెంట్‌లోకి అడుగుపెట్టింది.

"ఇక్కడ" పిలిచాడు మేథ్స్ టీచర్.

అతని పక్కన కూర్చుని వున్న ఇరవై రెండేళ్ళ అమ్మాయిని చూసి వులిక్కిపడింది సుకన్య. సుకన్యని పరిచయం చేయగానే షేక్‌హేండ్ ఇచ్చి చెప్పిందామె మేథ్స్ టీచర్‌తో-

"నువ్వు చెప్పినట్లు అందంగానే వుంది నాకన్నా."

సుకన్య సిగ్గుపడింది.

"వరంగల్‌లో ఎం.బి.బి.ఎస్. చదువుతోంది. పేరు పరిమళ. నా ఫియాన్సీ... ఐ మీన్ వచ్చే మేలో మా ఇద్దరి వివాహం జరగబోతోంది" చెప్పాడు అతను.

భోజనం ఎంతో బావుంది. కాని నాలుగైదుసార్లు కొరపోయింది సుకన్యకి. ఐస్‌క్రీం తిన్నాక చెప్పింది ఆ అమ్మాయి సుకన్యతో నవ్వి-

"వేరుశెనగ పట్టీ ఇచ్చావుగా. అది ఎంత బావుందో! ఇతనికి అది సయించదు. నాకే ఇచ్చాడు వుదయం. ప్రతి ఆదివారం వస్తుంటాను. ఇతన్ని వారానికోసారయినా చూడకుండా వుండలేను."

సుకన్య కూడా మర్యాద కోసం నవ్వింది. మేథ్స్ టీచర్ బిల్ పే చేసాడు.

కిందకి వచ్చాక 'గుడ్ బై'లు అయాక మేథ్స్ టీచర్ వెనకాల పిలియన్ సీట్‌లో కూర్చుంది ఆమె.

"అలాక్కాదు. అతుక్కున్నట్లు కూర్చో" చెప్పాడు అతను రహస్యంగా.

సుకన్య ఇంటికి నడిచి వెళ్ళిపోయింది. వరంగల్ వెళ్ళే రైలు ఎక్కాక, తనకి సెండాఫ్ ఇవ్వడానికి వచ్చిన అతనితో చెప్పింది అతని కాబోయే భార్య—

"టీన్ ఏజ్ టీనేజర్‌కి మగ టీచర్ల మీద వుండే ఇన్‌ఫేట్యువేషన్‌ని మొదట్లోనే తగ్గించడం మంచిది అన్న నీ మాట కరెక్టే. ఆ అమ్మాయి నా గురించి తెలిక మునుపు నీవైపు ఎంత ఆరాధనగా చూస్తూ వచ్చిందో. నా పరిచయం అయాక మొహం ఎలా వెలా వెలాపోయిందో."

"అందుకే మనం త్వరగా పెళ్ళి చేసుకోవాలోయ్!" అందంగా నవ్వాడు మేథ్స్ టీచర్ రైలు కదులుతూండగా.